# పీటలమీద పెళ్లి

రచన :
'రమణీయ'

"అమ్మాయిగోరి పెళ్లి కుదిరిందటగా! మూర్తం గూడా యెట్టుకొన్నారంట" అంది పాలిచ్చే గొల్లమనిషి.

"ఔనేవ్! అప్పుడే నీదాకా వచ్చిందా?" అంది చాయమ్మ.

"పెళ్లయేదాకావుంది సంబరం, అప్పుడు పూర్తయిందని సంతోషించడం. అది సరే గాని, ఈ నీళ్లపాలేవిఁటి? రోజు రోజుకీ మరింత దిగజారిపోతున్నయ్!"

"ఈ నాౘ్రోజులే నండమ్మగారూ! ఐనా పాలూ నీళ్ళూలాగ సాగిపోవాలిగా నండమ్మా ఈ సంసారాలు....ఏటి శాశ్వితం చెప్పండితల్లీ! అమ్మాయిగోరి పెళ్లయి నాలుగు కాలాలపాటు సిలకా గోరింకల్లా కాపరాలుచేసుకోవాలి!" అంటూ దీవించి గొల్లమనిషి వెళ్లింది.

చాయమ్మ ఏదో ఆలోచనలోంచి తేలిపోయి, 'అమ్మాయ్ పార్వతీ! ఈ పాలగిన్నె లోపలికి పట్టుకెళ్ళుతల్లీ!' అని పిలిచింది.

అంతమాత్రం సంసారాల్లో పెళ్లిపనులకేవంత తొందర? అన్నట్టు అయింటి వాతావరణం చల్లగానే వుంది.

పార్వతిపాదాలమీద కుచ్చెళ్లు జీరాడుతున్నయి.

పెళ్ళిచూపుల కొచ్చిన వాళ్ళు చూసుకొని, చిదిపిదీపంపెట్టుకోవచ్చునని సంబరపడి, కట్నంకానుకల్ని అంతగా ఆశించకుండా, అమ్మాయి అందచందాలు చాలనుకొని, తొందరపడ్డారు! ముహూర్తంకూడా నిశ్చయించుకొన్నారు.

అతిదగ్గరైన ముహూర్తంకోసం ఎదురుచూస్తూ, ఆమె పారాణిపాదాలు ఉప్పొంగిపోతున్నాయి. తన మనస్సు కొత్త కొత్త అనుభవాలకోసం అఱ్ఱులుచాస్తున్నట్టుంది. జీవితంలో విశిష్టమైన మళుపువద్దకువచ్చి ఆగినట్టయింది!

* * *

ఇది జీవితాలపోరాటంగాని ఆరాటం కాదు అన్నట్టు పార్వతి నిరంతరం అన్వేషించే దేనికోసమో ఆమెనేత్రాలు ఊహలు తెంపుకొన్న గాలిపటాల్ని ఎగరవేస్తూ—ఆలోచనలో మునిగితేలుతున్నాయి.

ఆరోజునే పెళ్లికూతుర్నిచేశారు! ఆనాడే రాత్రికి ముహూర్తం! ఆమె పాదాలమీది పారాణిరంగులు కుచ్చెళ్ల చివళ్లకంటుకొని, రకరకాల ఊహలు పోతున్నట్టున్నయి.

ఎంతలో ఎంత ప్రయత్నం!

పద్దెనిమిదేళ్ళవరకూ, కాచుకొని, కాచుకొని కాంచిన కలలుపండే నిండువెన్నెల రోజు....ఎడద గగుర్పొడిచింది యీ సన్నివేశానికి! పెళ్లంటే మాటలా? నూరేళ్ల పంట!

పెళ్ళి కొడుక్కివేమీ పట్టనక్కర్లేదు. పార్వతి అతణ్ణిచీకటినిచూసినట్టుచూసింది. అతను తనమెడలో వేయవలసినవి మూడుముళ్ళు.... అతనికి కావల్సినవి రెండే రెండు కళ్ళు....! ఎవరెంత పుణ్యంచేసుకొంటే వాళ్లకంతే ప్రాప్తి. పార్వతి పెళ్ళిచూపులప్పుడే జీవితంలో విషవిషాదాన్ని గొంతులో యిముడ్చుకొని బాధపడాల్సివచ్చింది.

ఈడూ జోడూ కాని సంబంధమైనా పార్వతిశాపాన్ని భరించి తీరాల్సిందే అని లోకం శాసించింది.

పెళ్ళికొడుకు నీగ్రోరంగు—కళ్ళు గాజుకళ్ళు పూర్వమెప్పుడో పిచ్చిపట్టి కుదిరిందట! అవన్నీ యిప్పుడెందుకు?

పార్వతి తనస్థితి తలుచుకొని పదేపదే కుమిలిపోయింది. ఇటు తను తనకుకాక మరెవ్వరికీకాక ఏమయిపోతోందోనని భయం ఆవేశించింది. ఎందుకీ భయాలు? ఆవేశాలు? కానున్నది కాకమానదు అని సంబాళించుకొంది. ఇక తల్లిదండ్రుల ఆవేదన వాళ్ళదే!

మగపెళ్ళివారు ముహూర్తానికి కావల్సిన హంగామాతో మందీ మార్బలంతో, బెట్టుతో మరి రట్టూరవ్వాతో సహా వేంచేశారు. పెళ్లికూతుర్ని తమదాన్ని చేసుకోడానికి వాళ్ళ అర్భాటం అంతా ఇంతా కాదన్నట్టుంది! మగపెళ్ళివారు విడిదిచేరుకునేటప్పటికి — సూర్య గోళం పడమటి దిక్కున అరుణ సౌందర్యం చెరిపివేసుకొంటో చీకట్లోమునిగిపోయింది! ఆరాత్రికే సుముహూర్తం. రేపే తమ జీవితాల ప్రారంభము అనుకొన్నారు వధూవరులు.

పేరంటాళ్ళూ, ఆడవాళ్ళూ అందరూ పెళ్ళికూతురిచుట్టూ, పెద్దవాళ్లు మగవాళ్లు అంతా పెళ్లికొడుకుచుట్టూ ఈ వివాహంలో పరిభ్రమణం చేస్తున్నట్టుంది.

పెళ్ళికూతురితండ్రి 40 ఏళ్ళు నిండిన అర్భకుడు పాపం! ఈ పెళ్ళయితే, తన కూతురి అందచందాల ఆకర్షణలవల్లనైతే సాధించి చేయగలుగుతున్నాడుగాని, లేకపోతే, ఆడపిల్ల పెళ్ళి చేయగలగడమే! ఆయన తన భార్య చాయమ్మ, భుజస్కంధాలమీద మోపి-'నువ్వే అమ్మాయిని కన్నావు! నువ్వే యీ పెళ్ళి సంబరాన్ని కడతేర్చుకో!' అని ఓమూలతాపీగాకూర్చుని వచ్చేపోయేవాళ్ళతో పోచికోలు కబుర్లు చెపుతూ వీధిలో పందిరి ఎంత ఘనంగా వేయించిందీ, ఎంత తక్కువలో ఆ పుచ్చిపోయిన రాటలు కొన్నదీ—ఈ పిల్ల పెళ్ళి చేయడానికి ఎన్ని సంవత్సరాలనించి తలక్రిందులుగా తపస్సు చేసిఁదీ వివరిస్తున్నాడు.

బాజా భజంత్రీలవాళ్లు డోలూ సన్నాయి సరిజేసుకొంటున్నారు. 'ఎన్నో పెళ్ళిళ్ళు చేశాం ఇదొహటి మాకు లెక్కా!' అన్నట్టు ఊరికే చప్పళ్లూదిపోస్తున్నారు!

"ఆయనే చాయమ్మగారి మొగుడు పెళ్లికూతురితండ్రి' అని ఆయన్ని వేలెట్టి చూపించుకొంటున్నారు బంధుజనం—

మంగళ స్నానాలు పూర్తయాక పెళ్లితంతు ప్రారంభమయింది. పీటలమీద కూర్చున్నారు వధూవరులు. పురోహితుల వేదకంఠాలు గంటల్లా మ్రోగుతున్నాయి. బాజాభజంత్రీలు పెళ్లున మ్రోగుతున్నయి.

అందరివీ పెళ్ళికళ్ళు! రాత్రి నిద్రల్లేక తూగుతున్నారు. పెళ్లికొడుకు మాత్రం ఱెప్పలువిప్పకుని క్రీగంటిచూపులు చూస్తున్నాడు పార్వతివైపు.

'ఈయనకి బానిసని కాబోతున్నానా?' అని తలవంచుకొంది పార్వతి. చీర కుచ్చెళ్లు చివళ్లు ఆమె పారాణిపాదాలమీద జీరాడుతున్నాయి. పెళ్ళికొడుకు చూపులు బొటనవ్రేళ్ళమీద పడ్డాయి. తన కళ్ళు నమ్మలేకపొయ్యాడు. ఎంత అందంగా మొలిచాయి! తాబేలుముట్లుమాదిరి ఎంత అందంగా కదుల్తున్నాయి! పసుపురంగు బంగారుఛాయలీనుతూ ఎంత మనసుని పరవశింపజేస్తున్నాయి! వధూవరు లిరువురూ బెల్లంజీలకర్రముద్దలు శిరసుదాల్చడంతో దాంపత్యజీవితానికి నాందీప్రస్తావన జరిగింది. మంగళసూత్రధారణ తంతు దగ్గరపడేసరికి—బాజాభజంత్రీలు ఒక్కుమ్మడి ఫెళ్లునరేగాయి. పురోహితుడు జీవితరహస్యమన్నట్టు మంగళసూత్ర రహస్యాన్ని చెవిలో బిగ్గరగా చెప్పాడు.


"మాంగల్యం తంతునానేన
మమజీవన హేతునా...."

ఇత్యాదిగా....

పైపదాలు పెళ్ళికొడుకుచెవిలో సరిగా యిముడక....

"మాంగల్యం తెంతునా నేనా ?
మమజీవనం చేతునా?"

అంటూ బిగ్గరగా చదివాడు. వినబడిన పురోహితులు పెద్దలూ అంతా విరగబడి నవ్వారు. ఎందుకో అర్థంకాక పెళ్లికొడుకు పెళ్ళికూతురివేపు తెల్లబోయి చూశాడు.



పెళ్లికూతురు పార్వతికూడా కళ్లెత్తినవ్వింది. తన్నుచూసి నవ్వుతుందా ? ఎంత ఆడదయితేమాత్రం పెళ్ళికొడుక్కి తలకొట్టేసి నట్టనిపించింది.

మంగళసూత్రధారణ పూర్తికాగానే, పెళ్లికూతురితల్లి చాయమ్మమనసులో బెరుకు దీరిపోయింది. గుండె తేలికపడింది. కళ్లు ఆనంద బాష్పాలతో మిలమిల మెరిశాయి. అమ్మాయికిక మూడు ముళ్ళూపడ్డాయి!

చాయమ్మగారి మొగుడుకూడా హాయిగా గుండె నివురుకొన్నాడు. 'ఈ జీవితంలో ఒక్క ఘనకార్యం సాధించాను. ఆడపిల్ల పెళ్లి అతి తక్కువకట్నంకానుకలతో చేయగలిగాను' అనే గర్వంతో మనిషి ఊగిన లాడిపోయాడు. పెళ్ళికూతురికి, మగపెళ్లివారు ప్రత్యేకంగా చంద్రహారాలు, ఒక నెక్లీను తలమీదికి చంద్రవంకపెట్టి, వాళ్ళ అందాల సరదాలు దీర్చుకొన్నారు.

తలంబ్రాలుబియ్యం ఒకళ్ళమీద మరొకళ్ళు కసిగా పోసుకుంటున్నారు. పెళ్ళికూతురి శిరోజాలమీదనించి తూలిపడుతున్న ఆణిముత్యాల్లాంటి బియ్యపుగింజలు చీరకుచ్చెళ్ళనించి జారి బొటనవ్రేళ్లసందుల్నించి తూలిపడుతున్నాయి. బొటనవ్రేళ్లు రెండూ తాబేలుమూతుల్లా పైకి పెళ్లివారివేపు తొంగి తొంగి చూస్తున్నాయి. అప్పటికి పూర్తిగా తెల్లవారిపోతోంది. వధూవరులిద్దరికీ పాతనీరుపోయి క్రొత్తనీరువచ్చినట్టుంది. బరువు బాధ్యతలు తలమీద మోపినట్టయింది. నిద్రమత్తులోంచి తేరుకొంటున్న పెళ్ళివారు విడిదిలోకి వెళ్ళిపోవడానికి అయత్తమౌతున్నారు.

పెళ్ళికూతురికి పెళ్లికాలమందు పెట్టిన బంగారునగలు తమ కోడలికే గదా అని నిశ్చింతగా పెళ్ళికొడుకుతండ్రి చేతులు తుడుచుకొని, వియ్యపురాలితో లాంఛనాల విషయం మాట్లాడుతున్నాడు.

పెళ్లికొడుకు ఓమూల కుర్చీలో కూర్చుని పెళ్ళి కునికిపాట్లుపడుతున్నాడు.

లోపల్నుంచి ఒక్కసారి గుసగుసలు గుంపులు గుంపులుగా బయటికొచ్చాయి. లోపల ఉక్కకి కుక్కితే గుక్క తిరగనట్లు జనం ఘొల్లుమన్నారు.

ఒక్కవరుగున పెళ్ళికొడుకు పెద్దతల్లి బయటపడి రొప్పుతూరొజుతూ, 'అంబాబోయ్! బాబోయ్ ఇంకేవుంది? కొంపమునిగిందిరోయ్' స్థూలకాయాన్ని అటూ ఇటూ త్రిప్పుతూ 'అయ్యో నాతండ్రీ! నీ నూరేళ్ళ పంట గంగలో కలిసిందిరోయ్! పెళ్ళికూతురికాళ్ళు రెండుకాళ్ళూ బోదకాళ్ళురోయ్!' అని గుండెలు బాదుకొంది. అవిడే మొట్టమొదట కనిపెట్టింది!

పెళ్ళికొడుకు ఒక్కుమ్మడి ప్రాన్పడిపోయి 'మోసం....దగా....' అని కేకవేశాడు పెళ్లికూతురి గుండె దద్దరిల్లేట్టు.

పెళ్ళికొడుకుతండ్రి లోపలికివెళ్లి కాళ్ళు వేపు పరీక్షగా చూశాడు. బన్నురొట్టిలా పొంగివున్నాయి. తాటిబెచిప్పల్లా ఎత్తుగా కనిపించాయి. 'పైకి ఎఱ్ఱగా బుర్రగా వుందని ఆశపడి, కట్నం కానుకలకోసం ఆలోచించకుండా చేసుకొన్నాం. గోతిలో పడ్డాం తండ్రీ!' అని నెత్తీ నోరూ మొత్తుకొన్నాడు.

పెళ్లికూతురు కంటికిమంటికీ ఏకధారగా రోదిస్తూంది! తన్ని ఓదార్చేవారేలేక తల్లడిల్లిపోయింది. మెడలో మాంగళ్యసూత్రం ఉరిత్రాడు బిగుసుకున్నట్టు బిగుసుకొంటోంది. అధోలోకానికి వంగిపోయిన శిరసు పైకెత్తుకోలేకపోతోంది. తన ముఖములో శోకం జలపాతమై దుముకుతోంది, గుండె చెరువయి కళ్ళుగండిపడ్డట్టయింది. పాదాలమీద పారాణి ఆరిపోయి ఏనాడో కరిగిపోయింది.

పెళ్ళికొడుకుతండ్రి నిలదొక్కుకోలేక చిందులు త్రొక్కుతున్నాడు. వియ్యపురాలు చాయమ్మ ధైర్యం చిక్కబట్టుకొని సమాధానపరచడానికి ప్రయత్నించింది.

"చూడండి అన్నయ్యగారూ! మీరు చూసుకునే చేసుకొన్నారు. పెళ్ళిచూపులకు ఒకసారికాదు రెండుసార్లు మరీవచ్చి అమ్మాయిని చూశారు! మీ కళ్ళకి గంతలుకట్టి మేమేంచేయలేదు. అమాత్రందానికి అంత రాద్ధాంతం దేనికి? మా అమ్మాయికాళ్ళు దాచలేదు, కళ్ళు దాచలేదు. అటువంటప్పుడు మీరు మేం దగాచేశామని అనడం దేనికి?"

"పాదాలు కనపడకండా కుచ్చెళ్ళు చివళ్ళు కిందవరకూవేసికప్పేసి మమ్మల్ని మోసంచేశారు" అన్నాడు వియ్యంకుడు.

పెళ్ళికొడుకుకూడా లోపలికివెళ్లి చూచివచ్చాడు కళ్ళుతిరిగాయి. 'నాన్నోయ్! ఆ బోదకాళ్ళపిల్ల నాకువద్దు బాబోయ్!' అని బావురుమని ఏడిచాడు.

వేసిన మూడుముళ్ళూ పటపట త్రెంపుతూన్నట్టయింది.

వియ్యంకుడూ, వియ్యపురాలినీ నగలూ నట్రా సంగతి అడిగాడు చూచాయగా!

ఇద్దరూ తెల్లబోయారు.

"అదేవిఁటి? అమ్మాయిని ఏలుకోరా?" అని బిక్కచచ్చిపోయి అడిగారు.

"ఇంకా నయం! ఏలుకోవడంకూడానా? పిల్లకాదది అమ్మాయికాళ్ళు చూస్తూ మా వాడు జీవించగలడా?" అని గిరుక్కున తిరిగి పెట్టే బేడా పట్టుకొని, అంతా కట్టగట్టుకొని రైలుస్టేషనుకి చేరుకొన్నారు.

"పదండి" అందరూ పదండి! నగలు ఎలా యివ్వరో కోర్టులో సివిలుక్రిమినలుగా చర్యతీసుకొంటే అప్పుడు తెలుస్తుంది— చివరిసారి వియ్యంకుడు అన్నముక్కలు విని బేజారెత్తిపోయింది చాయమ్మ.

ఒక్కనిమిషంలో పెళ్ళియిల్లు ప్రేతకళగా తయారయింది. ఈ సంగతి ఒక్కక్షణంలో ఊరంతా పాక్కిపోయింది.

"అమ్మాయి యేవంటోంది?" అన్నాడు తండ్రి.

"ఏవంటుంది? దానిబొంద .... ఇంత అవమానం జరిగాక బతికేం చచ్చేం? ఏనాడో చేసుకొన్న పాపం ఇలాబద్దలయింది. ఇన్నాళ్ళకి దొరకక్క దొరకక్క ఏదో సంబంధము దొరికిందనుకొంటే ఇదిలా తెల్లవారింది! దాని బతుకులో నిప్పులుపోసినట్టయింది. అమ్మాయికి బోదకాళ్లుండటం వాళ్ళుచూసుకోకపోవడం మన తప్పా? ఏం మాట్లాడరేం?" అని చాయమ్మ విలవిలలాడింది.

"వాళ్ల కాళ్ళూ చేతులూ పట్టుకొనైనా బ్రతిమిలాడి అమ్మాయి కాపురం నిలబెట్టాలి!" అనుకొన్నాడు తండ్రి.

"అది యీ జన్మలో సాధ్యమౌతుందా?" అనుకొంది తల్లి.

"ఈ జీవితాంతం యీ బరువుతో ఇలా క్రుంగి కృశించి పోవలసిందేనా?" అనుకొంది కూతురు.

* * *

ఇల్లు బావురుమంది. ఎవళ్ళకి వాళ్ళు తమకేం పట్టనట్టు జారుకొన్నారు. వంటమనుషులు, పనివాళ్లు పెళ్ళినిమిత్తం వేంచేసిన పెద్దలూ తుపాకిదెబ్బకి ఫికరు లేకుండా జారిపోయారు.

ఛాయమ్మకేం పాలుపోవడములేదు. మంగళసూత్రధారణతో అన్ని గండాలు గడిచి గట్టెక్కాం అని హాయిగా వూపిరి తీసుకొంది. కాని పిరికిపందల్లా అవతలివాళ్ళు పరువెత్తి పారిపోయారు. వాళ్ళకి జరిగింది పెళ్లనిపించడంలేదు. ఏదో 'మోసం. దగా' అని పరాభూతులయ్యారు.

ఇక పార్వతి, మంగళసూత్రాల ప్రభావంతో వాళ్ళతోడిదీ లోకమనుకొంది. ఆయనతో తనరక్తం పంచుకోవాలనుకొంది. తనలో ప్రవహించే అర్షసంప్రదాయపు నెత్తురు భర్తతోడిదే లోకమని శంఖమెత్తి ఘోషించింది. కాని ఏంప్రయోజనం?

'పోతేపోనీ....వాళ్ళొట్టి పిరికిమందులు తాగినవాళ్ళు....మళ్లీ రేపేపాటి మరో చక్కని సంబంధం తీసుకొచ్చి పెళ్ళి చెయ్యనూ?' అని తండ్రి ధైర్యంచెప్పాడు. గృహవాతావరణాన్ని సముదాయించాడు.

ఛాయమ్మ, కూతురు ఏ అఘాయిత్యమూ తలపెట్టకండా, కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చింది—

* * *

ఆ రోజునే వాళ్లదగ్గర్నుంచి - ప్లీడరు నోటీసువచ్చింది....జరిగిన అన్యాయానికి మోసానికీ—క్షమాపణ కోరుకుంటూ, పెళ్లి ఖర్చులు యావత్తూ ముదరాయిస్తూ నగా నట్రా అప్పగించవలసిందని కాకపోతే, సివిలు క్రిమినలుచర్యలు జరిపిస్తామని బెదిరిస్తూవచ్చింది నోటీసు. అందులో పెళ్లికూతురిసంగతి అవంతయినాలేదు.

పార్వతి నోటీసు చూసుకొని కుమిలి కుమిలి ఏడ్చింది. సరిగా తిండితిప్పలు తినడంలేదు. మనశ్శాంతిలేదు. జరిగినదంతా ఇంద్రజాలంలా మోసంగా ప్రతిక్షణం తన్ని నిలవేస్తోంది వాళ్ల కోపతాపాలకి, క్రూర శాపాలకి తను ఆహుతికావల్సి వస్తోంది.

తనెవరి కెందుకు ఆహుతికావాలి? తన కాళ్లమీద తను నిలబడగలిగి బ్రతికితే తనకింక ఆక్షేపణ ఉండదు ఎవర్నీ తను లక్ష్యపెట్టనక్కర్లేదు.

ఆడదంటే విలాసవస్తువా? సంఘానికి? బజార్లో విక్రయించే, సర్వసాధారణవస్తువా? కావాలంటే అట్టే వుంచుకోడానికీ అక్కర్లేదంటే మానేయడానికి, వీలుగా బేరమాడబడే యంత్రంలాంటిదా? ఛీ?....

పార్వతి తనమీద ప్రయోగింపబడిన ఈ దుష్కరప్రయోగానికి, జీవితం నిలువెల్లా కూలిపోయింది. కాని చచ్చేం సాధించగలదు? బ్రతికి బావుండి సమాజానికి ప్రపంచానికి గుణపాఠం చెప్పగలగాలి!

తను ఏ కుట్టుమిషనో అంబరుచరఖానో ఆశ్రయించి తనకాళ్లమీద తను నిలబడగల్గినపుడు లోకం విస్తుపోయిచూస్తుంది. తన అభ్యుదయం—లోకానికి కన్నెఱ్ఱనౌతుంది.

ఈ పురుషప్రపంచాన్ని నమ్మకండా తనకాళ్లమీద తను నిలబడి జీవించడమే తన అంతిమ నిర్ణయం! అదే జీవితలక్ష్యం!

★